క్లుప్తంగా

అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): వ్యాఘ్రపుర క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని గాజులపేటలో కొలువైన శ్రీ అభయాంజనేయ స్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ భూనీళా సమేత శ్రీ వరదరాజ స్వామి ఆలయంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి సహస్ర నాగవల్లి పత్ర పూజలో భాగంగా దివ్య పుష్ప మాలాంకృత అలంకారం చేశారు. భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను అర్చకులు దీవి గోపి శాస్త్రోక్తంగా నిర్వహించారు.

దేవాలయ ప్రాంగణంలో పూల మొక్కలు



అమృతలూరు(భట్టిప్రోలు): శైవ క్షేత్రమైన అమృతలూరు మండలం గోవాడలో కొలువైన శ్రీ పార్వతీదేవి సమేత శ్రీ బాలకోటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం మంగళవారం పురస్కరించుకుని దేవాలయ ప్రాంగణంలో దేవతా వృక్షాలు, పూల మొక్కలు నాటారు. కార్యనిర్వాహణాధికారి బి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వాహకులు పావులూరి రమేష్, టి.బాలకృష్ణ, ప్రధాన వేద బ్రాహ్మణులు స్వర్ణ శ్రీనివాస శర్మ, అర్చకులు చావలి శ్రీధర్ శర్మ, పొన్నపల్లి సత్యనారాయణ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయంలో స్వామివారు, అమ్మవారిని దర్శించుకుని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

25 శాతం సీట్ల దరఖాస్తుకు నేడే చివరి తేదీ

భట్టిప్రోలు: విద్యాహక్కు చట్టం-2009 అనుసరించి అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేద, బలహీన వర్గాల పిల్లల కోసం కేటాయించినట్లు మండల విద్యాశాఖాధికారి నీలం దేవరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సీట్లలో అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. కాగా ఖాళీగా ఉన్న సీట్లను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి బుధవారంతో గడువు ముగుస్తుందని.. 21న విద్యార్థుల అర్హత నిర్ధారణ, 25న లాటరీ ఫలితాల ప్రకటన, పాఠశాలల్లో 31న అడ్మిషన్లు ఖరారు చేస్తామని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



పిట్టలవానిపాలెం(కర్లపాలెం): అమరజవాన్ పరిశా మోహన్ వెంకటేష్ కుటుంబ సభ్యులకు స్వచ్ఛంద సంస్థలు అండగా నిలవాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కోలా పద్మజ కోరారు. పిట్టలవానిపాలెం మండల కేంద్రంలోని గౌడపాలెం గ్రామానికి చెందిన అమరజవాన్ పరిశా మోహన్ వెంకటేష్ కుటుంబ సభ్యులకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు మంగళవారం అందజేశారు. సంస్థ ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు, సభ్యులు మోహన్‌గౌడ్, రామాంజనేయులు, సుబ్బారావు, అనంతకుమారి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదలు తొలగింపు

వేమూరు: ఆర్అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్ల కంచెలను తొలగించామని ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలో పలు రోడ్ల మలుపుల వద్ద ముళ్ల పొదలు పెరిగిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలను నివారించేందుకు ముళ్ల కంచెలను తొలగించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ముళ్ల కంచెలు పెరిగి ఉంటే మా దృష్టికి తీసుకు రావాలన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి



తెనాలి టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు పరిహారం అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రూరల్ మండలం నందివెలుగు గ్రామంలోని సచివాలయంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. వరదల కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకూ రూ.10 వేలు పరిహారం ఇవ్వాలని కోరారు.

'అన్నదాత సుఖీభవ'కు దరఖాస్తు చేసుకోవాలి

రేపల్లె: అర్హత ఉండి అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నగదు పెట్టుబడి సాయం అందని రైతులు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి మహేష్‌బాబు తెలిపారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పిరాట్లంక గ్రామంలో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకానికి త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులకు యూరియా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. రైతులు యూరియా కొనుగోలు చేసిన సమయంలో రసీదును తప్పని సరిగా పొందాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సంరక్షణ, ఎరువుల వినియోగం, పురుగు మందుల వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న మహేష్‌బాబు

చెరుకుపల్లి: జీవన ఎరువు ఆహార నాణ్యత భద్రతకు కవచం అవుతుందని రేపల్లె అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.లక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని కావూరు, ఆరుంబాక గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫారూక్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రైతు రసాయన ఎరువులు తగ్గించి నేలను కాపాడాలని కోరారు. ఈ నినాదాన్ని ప్రతి ఒక్క రైతు పాటించి నేలను, పంటను కాపాడుకోవాలని సూచించారు. జీవన ఎరువులు పంటకు పునరుజ్జీవింప చేసి పోషక వినియోగాన్ని సమర్థవంతం చేస్తాయని తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న లక్ష్మి

భూసార పరీక్షకు అనుగుణంగా వాడకం..

రైతులు ముఖ్యంగా భూసార పరీక్షను అనుసరించి ఎరువులు వాడాలని.. అధికారులు మొదటి దఫా సిఫారసు చేసిన భాస్వరం ఎరువును విధిగా నాటుకు ముందుగా వేయడంతో త్వరగా మొన తిరిగి ఎక్కువ దుబ్బు చేస్తుందని లక్ష్మి తెలిపారు. దమ్ములో భాస్వరం ఎరువును వేయని నేపథ్యంలో నాటిన ఐదు రోజుల లోపు డీఏపీ ఎరువు లేదా.. కాంప్లెక్స్ ఎరువు చల్లుకోవచ్చన్నారు. కాంప్లెక్స్ ఎరువులు పిలక దశలో అంకురం ఏర్పడే సమయంలో వేయరాదన్నారు. అనంతరం కనగాల రైతు సేవా కేంద్రంలో రైతులకు ఏడీఏ, ఎంఏవో స్థానిక నాయకులు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు, వీఏఏలు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ఓట్ల చోరీ.. ఈసీ–బీజేపీ కుట్రలను గమనిస్తున్న ప్రజలు

తెనాలి టౌన్: దేశంలో జరుగుతున్న ఓట్ల దొంగతనాన్ని, ఈసీ–బీజేపీ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు పేర్కొన్నారు. 'ఓట్ల దొంగతనం ఆపాలి.. నరేంద్ర మోదీని గద్దె దింపాలి' అనే నినాదంతో మంగళవారం స్థానిక మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం పార్టీలు పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని సాంబశివుడు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఓట్ల చోరీని బయటపెట్టాక, ఎలక్షన్ కమిషనర్‌కు దిక్కుతోచడం లేదని ఆరోపించారు. ఈసీ వెబ్‌సైట్ నుంచి తీసుకున్న డేటాతోనే ఓట్ల చోరీని బయట పెట్టినట్లు ఆయన తెలిపారు. ప్రధాని మోదీ ప్రమాదకరమైన వ్యక్తి అని ఆయన పేర్కొన్నారు. మోదీ పాలనలో యథేచ్ఛగా ఓట్ల చోరీ జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, సీపీఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పి.నాగసూర్యశశిధరరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఎం.కిరణ్‌బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం వెంకటేష్, సీపీఎం ఏరియా కార్యదర్శి కె.బాబుప్రసాద్, నాయకులు భీమా రమేష్, ద్వారక శ్రీనివాస్, మల్లవరపు ప్రసాద్, దండు శివ, ఎం.పూర్ణచంద్రరావు, పి.ప్రభాకర్, కె.కోటేశ్వరరావు, బి.రమేష్, సీహెచ్.అయ్యప్ప, మల్లికార్జున, పెనుగొండ శివకుమార్, డి.శ్రీను, పోతే రాము, అనిల్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్, వామపక్ష నాయకులు

విద్యార్థులకు ఫిలాటెలీ స్కాలర్‌షిప్

సెప్టెంబరు 16 చివరి తేదీ

తెనాలి: ఫిలాటెలీని హాబీగా చేస్తున్న విద్యార్థులను ప్రోత్సహించడానికి తపాలా శాఖ 'దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన' పథకం కింద ఏడాది పాటు స్కాలర్‌షిప్‌ను ఇవ్వనుందని.. ఆసక్తి కలిగిన వారు సెప్టెంబరు 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 6 నుంచి 9 తరగతుల మధ్య మంచి అకడమిక్ రికార్డు కలిగి ఫిలాటెలీని హాబీగా చేస్తున్న విద్యార్థులు తపాలా సర్కిల్ నిర్వహించే క్విజ్, ఫిలాటెలీ ప్రాజెక్టు ఆధారంగా ఒక ఏడాదికి రూ.6 వేల స్కాలర్‌షిప్ పొందవచ్చని తెలిపారు. విద్యార్థి చదివే పాఠశాలలో ఫిలాటెలీ క్లబ్ ఉండాలనీ.. లేదా సొంత ఫిలాటెలీ డిపాజిట్ అకౌంట్ కలిగి ఉండాలని ఆయన సూచించారు. తొలుత క్విజ్ పోటీ, తర్వాత ప్రాజెక్టు పోటీ అనంతరం స్కాలర్‌షిప్‌నకు ఎంపిక చేస్తారు. మరిన్ని వివరాలకు దగ్గర్లోని పోస్టాఫీసును సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కాలువల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



బాపట్ల: మండలంలోని కచ్చా కాలువల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని శాశ్వత డ్రైనేజీలు లేని చోట్ల కచ్చా కాలువలతో వెంటనే మురుగు తొలగించే పనులు చేపట్టాలని రామకృష్ణ సూచించారు. మండలంలోని నందిరాజుతోటలో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలి



బాపట్ల: ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటాలని బాపట్ల మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ డాక్టర్ బి.శరత్‌బోస్ పేర్కొన్నారు. ప్రపంచ మానవత్వపు దినోత్సవం సందర్భంగా మంగళవారం బాపట్ల పట్టణంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ శ్మశానవాటిక, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరణం రవీంద్ర, కోలా సుబ్బారావు, అల్లాడి రాజకుమార్, జి.వి.ఎల్ మోహన్ గౌడ్, ఎం.ప్రసన్నాంజనేయులు, ఈకో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శానిటేషన్‌తోనే గ్రామాల అభివృద్ధి

జిల్లా పంచాయతీ అధికారి వెంకట నాగ సాయికుమార్

చేబ్రోలు: పారిశుద్ధ్యం పంచాయతీల ప్రధాన లక్ష్యమని, గ్రామాల అభివృద్ధి సమర్థవంతమైన శానిటేషన్ తోనే ముడిపడి ఉందని జిల్లా పంచాయతీ అధికారి బి.వెంకట నాగ సాయికుమార్ అన్నారు. ఉమ్మడి ఐదు జిల్లాలకు చెందిన ఎంపీడీవోలు, నూతన ఎంపీడీవోలకు బాపట్ల శిక్షణ కేంద్రంలో కొద్ది రోజులుగా వివిధ అంశాలపై సమగ్ర శిక్షణ అందజేస్తున్నారు. మంగళవారం క్షేత్ర పరిశీలన కోసం వీరందరూ చేబ్రోలు మండలంలో పర్యటించారు. ఈ సందర్శనలో మండల కేంద్రమైన చేబ్రోలు, వడ్లమూడి గ్రామాల్లోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. వడ్లమూడి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి బి.వెంకట నాగ సాయి కుమార్ మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న ఎంపీడీవోలు పనిని సమర్థవంతంగా చేయడానికి అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానం దృక్పథాన్ని పొందడానికి ఈ శిక్షణను ఉపయోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి ఇంటి నుండి ఘన వ్యర్థాల సేకరణ వాటి నిర్వహణ నిరంతర అధ్యయనమన్నారు. సేకరించిన చెత్తను వేరు చేసి, తడి చెత్తను సేంద్రియ ఎరువుగా, పొడి చెత్తను షెడ్డు ద్వారా విక్రయించటం లేదా రీసైకిల్ చేసి సంపద సృష్టించడమే ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్ర లక్ష్యమని వివరించారు. పంచాయతీ సిబ్బంది వీటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రతి పంచాయతీ కార్యదర్శి విధిగా నిర్వహించాల్సిన 10 ప్రశ్నలు వాటి కార్యచరణ వివరాలను డీపీఆర్సీ రీసోర్స్ పర్సన్‌లు అనురాధ, నిరంజన్‌లు వివరించారు. ఉమ్మడి 5 జిల్లాల ఎంపీడీవోలు కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో గుంటూరు ప్రకాశం నెల్లూరు కృష్ణ ఉమ్మడి జిల్లాలలోని ఎంపీడీవోలు, చేబ్రోలు ఇన్‌చార్జి ఎంపీడీవో ఏ ఉమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో ఎం.రవిశంకర్, చేబ్రోలు, వడ్లమూడి పీఎస్‌లు కె.శ్రీనివాసరావు, చంద్రబోస్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న నాగ సాయికుమార్

రైతులు ఉద్యాన పంటలపై ఆసక్తి చూపాలి

ఉద్యానవన శాఖాధికారి ఉప్పాల శ్రీనిత్య

తెనాలి టౌన్: హైబ్రీడ్ కూరగాయల సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపాలని తెనాలి ఉద్యానవన శాఖాధికారి ఉప్పల శ్రీనిత్య పిలుపునిచ్చారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడారు. తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర మండలాల పరిధిలో జామ, నిమ్మ, సపోటా, టీసీ బానానా, బొప్పాయి, విడి పూల పెంపకం చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల ఈ పంటలకు ఎటువంటి నష్టం వాటిల్లలేదని చెప్పారు. హైబ్రీడ్ కూరగాయల సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.9,600లు ప్రోత్సాహక నగదు వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందని వెల్లడించారు. టమాటా, క్యాప్సికం వంటి పంటలను తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల ప్రాంతాలలో వేసుకోవచ్చని సూచించారు. రైతులు ఉద్యాన పంటలపై ఆసక్తి కనబరచాలని ఆమె పేర్కొన్నారు.

మంచి అలవాట్లతోనే సంపూర్ణ ఆరోగ్యం

- వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు
- ఉచిత పోషకాహార ఆరోగ్య పరీక్షలు కౌన్సెలింగ్

పెదకాకాని(ఏఎన్‌యూ): మంచి ఆరోగ్యకరమైన అలవాట్ల ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్ సైన్స్, న్యూట్రీషన్ అండ్ డైటిటిక్స్, వ్యాయామ కళాశాల, కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులు ఉచిత పోషకాహార పరీక్షలు, కౌన్సెలింగ్ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఏఎన్‌యులోని డైక్‌మెన్ ఆడిటోరియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఎస్ఆర్ డైరెక్టర్, ఫుడ్ సైన్స్, న్యూట్రీషన్ అండ్ డైటిటిక్స్ హెచ్ఓడీ డాక్టర్ బి.బబిత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ పోషక ఆహార లోపాలను అధిగమించాలంటే ముఖ్యమైన విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉండే ఆహార పదార్థాలను ప్రతిరోజు తీసుకోవాలన్నారు. దానితో పాటు ఆరోగ్యకరమైన అలవాట్లు కలిగి ఉండాలని సూచించారు. ఉద్యోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు అభినందించారు. భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాలు సమాజహితం కోసం గ్రామాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాంతిశ్రీ, డాక్టర్ జలజ కుమారి, సీఎస్ఆర్ సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.వెంకట రమణ, వ్యాయామ కళాశాల ఆచార్యులు డాక్టర్ కిషోర్, డాక్టర్ రామ్మోహన్ రావు, వికాస అధ్యక్ష కార్యదర్శులు ఎస్.ప్రసాద్, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది పరీక్షలు చేయించుకున్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభించిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు

కాలువల్లోని వ్యర్థాలను రోజూ తొలగించాలి



తెనాలి అర్బన్: కాలువల్లోని వ్యర్థాలను రోజూ తొలగించాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు సూచించారు. 37వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే గంగానమ్మపేటవాసి సోమరౌతు అర్జునరావు తన ఇంట్లో ఏర్పాటు చేసిన హోం కంపోస్టును పరిశీలించి పలు సూచనలు చేశారు. హోం కంపోస్టును అందరూ ఏర్పాటు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

రేపల్లె: ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మణిలాల్ డిమాండ్ చేశారు. ఆటో కార్మిక సంఘాలు, సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు పథకం ఆటోడ్రైవర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉపాధికోల్పోయి వారి కుటుంబాలు రోడ్డునపడ్డాయని తెలిపారు. వాహన మిత్ర పథకం ద్వారా ఒక్కో కార్మికుడికి ఏటా రూ 25,000 అందించి అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. బస్టాండ్ సెంటర్ నుంచి రింగ్‌రోడ్ సెంట్రల్ వరకు ఖాళీ ఆటోలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘాల నాయకులు వాసు, విజయ్, నాగరాజు, మాణిక్యరావు, రవీంద్ర, బాబురావు, సీఐటీయూ నాయకులు కేవీ లక్ష్మణరావు, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, ఆటో కార్మికులు

అపరిశుభ్రంగా ఖాళీ స్థలాలు ఉంటే చర్యలు తప్పవు

బాపట్ల అర్బన్: పట్టణంలో అపరిశుభ్రంగా ఖాళీ స్థలాలు ఉంటే వాటి యజమానులకు నోటీసులు జారీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పలు చోట్ల ఖాళీ స్థలాలు మురుగు తటాకాలను తలపించే విధంగా ఉండడంతో యజమానులకు ఫోన్‌లు చేసి వెంటనే మెరకలు తోలించుకోవాలని సూచించారు. పలు చోట్ల నోటీసు బోర్డులు కూడా ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. అప్పటికీ యజమానులు స్పందించకపోతే వాటిని శుభ్రం చేయించి ఆ ఖర్చులను కూడా యజమాని నుంచే వసూలు చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కరుణా, నజీర్ ఉన్నారు.



ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న రఘునాథరెడ్డి

ఫొటోలతో జ్ఞాపకాలు పదిలం



కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ సలీమా, సీఐ రాంబాబు

బాపట్ల: ఫొటోలు జ్ఞాపకాలను పదిలం చేస్తాయని తహసీల్దార్ సలీమా పేర్కొన్నారు. ప్రగతి బాపట్ల ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సలీమా పాల్గొన్ని మాట్లాడారు. ఒక్కో ఫొటో జీవితంలో పాతజ్ఞాపకాలను గుర్తు చేస్తాయని తెలిపారు. పట్టణ సీఐ రాంబాబు మాట్లాడుతూ.. పోలీసు వ్యవస్థకు ఫొటోగ్రాఫర్స్‌కు మంచి సత్సంబంధాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నో కేసుల్లో ఫొటోగ్రాఫర్స్ పోలీసులకు సహకారం అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ హాస్పటల్‌లోని రోగులు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్.సుధాకర్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొమ్మిశెట్టి రత్నగుప్తా, రోటరీ ప్రెసిడెంట్ జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వెజెండ్ల శ్రీనివాసరావు, సీనియర్ ఫొటోగ్రాఫర్స్ జ్యోతి స్టూడియో కృష్ణ, రాజా డిజిటల్ స్టూడియో కృష్ణ, రమణ, జయరావు, మల్లేశ్వరరెడ్డి, వెంకటరావు, ఏడుకొండలు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు



కనులపండువుగా నిర్వహిస్తున్న ఊరేగింపు



చిన్నారుల కోలాట ప్రదర్శన

తెనాలి: త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్య ఆశీస్సులతో గత నాలుగు రోజులుగా జరుగుతున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు మంగళవారంతో ముగిశాయి. ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక తెనాలి-గుంటూరు ఉత్సవ కమిటీ నిర్వహణలో స్థానిక పాండురంగపేటలోని శుభం కల్యాణ మండపంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. రోజూ శ్రీకృష్ణునికి పూజా కార్యక్రమాలు, భగవద్గీత శ్లోక పఠనంతో కార్యక్రమాలను నిర్వహించారు. చివరి రోజున మధ్యాహ్నం 2 గంటల నుంచి స్వామివారి ఊరేగింపును సందడిగా జరిపారు. ఊరేగింపులో భాగంగా ఏర్పాటు చేసిన కోలాటం ఆకర్షణీయంగా సాగింది. త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి-ఇందూ జ్ఞానవేదిక తెనాలి ఉత్సవ నిర్వాహకులు టీవీ కృష్ణారావు, గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, రొంపిచర్ల రామకృష్ణ, బ్యాంకు శ్రీను, శివలింగం, రామోజీ, హరిబాబు, బ్రహ్మం, పట్టాభి, శ్రీను, గోపి, విద్య, శ్రీదేవి, షేక్ దిల్షా, రేణుకాదేవి తదితరులతో పాటు చిలకలూరిపేట, పిడుగురాళ్ల, భీమవరం, నూజివీడు నుంచి భక్తులు పాల్గొన్నారు.

స్వామిత్వ పథకంతో భూ తగాదాలకు చెక్

తెనాలి టౌన్: స్వామిత్వ పథకంతో భూ తగాదాలకు శాశ్వత పరిష్కారం చూపవచ్చని ఎంపీడీవో అత్తోట దీప్తి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లు, సర్వేయర్లతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అత్తోట దీప్తి, డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ.ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్వామిత్వ పథకం ఫేజ్-2లో భాగంగా తెనాలి మండలాన్ని ఈ స్కీమ్ కింద ఎంపిక చేసినట్లు చెప్పారు. డ్రోన్ సర్వే ద్వారా గ్రామంలోని ఇల్లు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ, అసైన్డ్ భూములు, గ్రామకంఠాలు గుర్తించి స్వామిత్వ స్కీమ్‌లోని ప్రాపర్టీ పార్శిల్ మ్యాప్స్ ప్రకారం గ్రౌండింగ్ చేయవచ్చని తెలిపారు. ఈ ప్రోగ్రామ్ చేయడం వల్ల పంచాయతీ పరిధిలోని ఇళ్లకు సంబంధించిన కచ్చితమైన స్థలం, హద్దులు గుర్తించవచ్చని వివరించారు. తద్వారా భూ తగాదాలకు చెక్ పెట్టవచ్చని తెలిపారు. మండల పరిధిలో 7 గ్రామాలకు ఎంపిక చేశామని.. బుధవారం నుంచి నిర్దేశించిన టీమ్‌లు, ఆయా గ్రామాల్లో పని చేస్తాయని వివరించారు. సమావేశంలో కార్యాలయ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, సర్వేయర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దీప్తి